


*(గత సంచిక తరువాయి)*

**అరసు ఇంతవరకు పి.ఎల్.** గ్రూప్ కంపెనీ ల గురించి క్షుణ్ణంగా చదివి, డైరెక్టర్ గా పని మొదలు పెడదాము అనుకున్న వాడెల్ల, ఈ కొత్త కంపెనీ ల వివరాలు తెలిసి కొంచెం షాక్ అయ్యా దని, మహేష్ కు అనిపించింది. పి.ఎల్. మొదటి నుంచి నమ్మకస్తులు, తన పై పూర్తిగా విశ్వాసం ఉన్న వారికే ఉన్నత పదవులు ఇవ్వడం వల్ల అరసుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, అరసుకి ఎప్పుడు సందేహాలకు వచ్చినా, సహాయం కావలసినా, తను కూడా ఉంటానని మహేష్ చెప్పాడు.

అరసు, మహేష్ తో బాటు ఎయిర్పోర్ట్ లో దిగగానే ఈ సారి పి.ఎల్. గ్రూప్ ఉద్యోగులు ఎదురు వచ్చి, అరసు పర్సనల్ స్టాఫ్ గా పరిచయం చేసుకున్నారు. పి.ఎల్. గ్రూప్ డైరెక్టర్ గా తన పని మొదలై పోయిందని అరసు అనుకున్నాడు.

–27 –

**కిస్సిమి, ఫ్లోరిడా**

**నవంబర్, 2014**

విశ్వం కు ఆపరేషన్ వచ్చే వారమే. స్నేహితులు కూడా ఆపరేషన్ రోజు హాస్పిటల్ కు వస్తామన్నారు కానీ, విశ్వం, సీతలు అందరిని సున్నితంగా తిరస్కరించారు. అయినా బలవంతంగా వస్తామని ఎవరు బలవంత పెట్టలేదు. వర్కింగ్ డే ఎవరు లీవు పెట్టాలనుకుంటారు. చివరకు, సీత, లక్ష్మీ మాత్రమే మిగిలారు. లక్ష్మి ఆ వీకెండ్ నుంచి ఓ వారం లీవు పెట్టింది. సీత ఎలాను అన్నివిధాల అండ గా ఉంటుంది. మామూలుగా అమాయకంగా ఉండే సీత లో గత 6 నెలలుగా వచ్చిన మార్పులు చూసి విశ్వం విస్తూ పోతూనే ఉంటాడు. కాన్సర్ అని తెలిసినప్పుడు బాగానే బాధ పడినా, వెంటనే బాధ్యత తీసుకొని, విశ్వంకు శ్రమ లేకుండా, ఈ కాన్సర్ పోగొట్టుకొనే గమ్యం వైపు నడిపిస్తూనే ఉంది. మొన్నో రోజు, టాబ్లెట్ సైడ్

ఎఫెక్ట్ వల్ల తల తిరిగి అచేతనంగా పడిపోతే, తనే భుజం మీద విశ్వం శరీరం ఆనించి,బెడ్ మీద పడుకోబెట్టి, తెలిసిన కార్డియోలోజిస్ట్ కి ఫోన్ చేసింది. టాబ్లెట్ ల వల్ల బి.పి. పడిపోయి ఉండవచ్చు నని, గేట్ రెడ్ తెచ్చి తాగిస్తే, మళ్లీ మామూలు అయ్యాడు విశ్వం.

దానికి తగట్టు గత నెల ఆఫీసులోను పని నచ్చ లేదు.

బెత్ జూలిని విశ్వం నుంచి పని నేర్చుకో అంటూనే, విశ్వంకు రాగా, రాగా పని లేకుండా చేసేసింది. ఎందుకో బెత్ తో తన క్యాన్సర్ పోరాటం గురించి చెప్పాలనిపించలేదు.

బెత్ విశ్వం రెండు వారాల సెలవు అడగడం చూసి, లాంగ్ టర్మ్ ఇన్సూరెన్స్ అప్లై చెసుకోవడానికి ఓ లింక్ పంపించింది. చాలా యాంత్రికంగా ప్రవర్తించింది.

రాబర్ట్ కు ఫోన్ చేసి, తన క్రూయిజ్ గురించి, అక్కడ పిరమిడ్ గ్రూప్ కు సంబంధించిన కంపెనీ గురించి వివరాలు పంచుకున్నాడు.

"అయితే మనకు ఇది రోడ్ బ్లాక్. ఇంకేదైన మార్గం ఉందేమో చూడాలి", అన్నాడు రాబర్ట్.

"నేను అదే ఆలోచిస్తున్నాను. లక్ష్మి, నా డాటర్ తెలుసు కదా. తను స్వతంగా ఎదో అల్గోరితం ఉపయోగించి, ఈ కంపెనీలు మధ్య సంబంధాలను బహిర్గతం చేయాలని ప్రయత్నిస్తున్నది. నాకేమైనా తెలుస్తే ముందే నీకు తెలుపుతాను లే", అన్నాడు విశ్వం.

"గుడ్ లక్ నీ ఆపరేషన్ కి. ఏమైనా అవసరం ఉంటే కాల్ చేయి", అని వీడ్కోలు తీసుకున్నాడు రాబర్ట్.

శుక్ర వారం రావడంతో, బెత్ , ఆఫీసు అన్నీ మరచి పోయి తన ఆపరేషన్ గురించి ఆలోచించ సాగాడు విశ్వం.

ఆదివారం, సోమవారం భారీగా, చాలా నిదానంగా నే గడిచాయి విశ్వం, సీత, లక్ష్మిలకు. బయట పడితే బాగుంటుందని, ఆదివారం బీచికి తీసుకెళ్లాడు. ఆ సాయంత్రం, తిరిగి వస్తూ వస్తూ రెస్టొరెంట్ కి తీసుకెళ్లాడు విశ్వం. అందరూ నవ్వుతూ, సంతోషంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నా, కాన్సర్ రూంలో ఓ మదపుటేనుగు రూపంలో కాళ్ళు కదిలిస్తూనే ఉంది.

మంగళ వారం, పొద్దున ఏడు గంటల కంతా రమ్మన్నారు. అంత పొద్దున్నే పోయినా, తన ఆపరేషన్ 9 గంటలకి కానీ కాదని, తెలిసింది. ఈ సర్జన్ పొద్దున్న నాలుగు కంతా లేస్తాడని మనస్సులో అంచనా వేసుకున్నాడు విశ్వం.

ఆపరేషన్ లో తేడా వస్తే ఇదే ఆఖరి రోజేమో అన్న ఆలోచనా విశ్వం మదిలో మెదలకుండా , వుండ లేక పోయింది.

అయ్యినా ఈ ఆపరేషన్ సేఫ్ అనే చెప్పారు. కంప్యూటర్ తో నడిచే ఈ 'డ వించి' మెషీన్ పేషెంట్ పైన పెడితే, సర్జన్ మరో రూంలో కూర్చుని కంప్యూటర్ స్క్రీన్ లో కనిపిస్తున్న బొమ్మ చూసి ఆపరేషన్ చేస్తాడు.

'డ వించి' మెషీన్ కి కావాల్సిన కత్తులు లాంటి పరికరాలను అందజేయడాని, మెషీన్ , పేషంట్ ఉన్న రూంలో ఓ అసిస్టెంట్ ఉంటాడు. ప్రోగ్రాం చేసిన మెషీన్ కడుపు బొడ్డు చుట్టు ఆ ఆరు రంధ్రాలు చేసి, కెమెరా, ఆపరేషన్ కావాల్సిన కత్తులు, డ్రైన్స్ లాంటివి ప్రవేశపెడతుంది. కెమెరా నుంచి మరో రూము లో పనిచేస్తున్న సర్జన్ కంప్యూటర్ మానిటర్ కి వస్తున్న బొమ్మలు , ఓ పదింతలు పెద్దవిగా చూపెట్టడం వల్ల, సులువుగా 'డా వించి' మెషీన్ ద్వారా తీసి వేయవలసిన ప్రోస్టేట్ ను చాలా ఖచ్చితంగా కట్ చేయగలుగుతాడు. అలా చేయడం వల్ల ఇసుమాత్రం కాన్సర్ కూడా మిగల్చకుండా కట్ చేసి తీసివేయవచ్చు. అలా జీరో మార్జిన్ తో సర్జన్ ఆపరేషన్ సఫలంగా చేయగలిగాడు అన్న విషయం, తీసివేసిన ప్రోస్టేట్ ని పథలోజిస్ట్ పరిశీలించి న తరువాత కానీ తెలియదు.

ఆపరేషన్ కి చెక్ ఇన్ అయ్యినా వెంటనే, ఓ అసెంబ్లీ లైన్ లో కి తోసి వేసినట్లనిపించింది, విశ్వం కు. ఓ రూమ్ కు తీసుకెళ్లి, మొత్తం దుస్తులు తీయించేసి, ఓ ఆపరేషన్ గౌన్ లోకి మార్పించేశారు విశ్వంను. వేసుకొచ్చిన గుడ్డలు, మెడలో చైను, వేలికి వేసుకున్న ఉంగరం అన్నీ తీసి హాస్పిటల్ వాళ్ళిచ్చిన బ్యాగులో పెట్టింది సీత. సర్జన్ చెప్పినట్లు, కడుపు, జీర్ణాసయం మొత్తం ఖాళీగా చేసుకొని విశ్వం అక్కడికి వచ్చాడని నిర్ధారించుకున్నారు. సర్జన్ చెప్పినట్లు విశ్వం ఆపరేషన్ చేసే కడుపు ఆ చుట్టూ పక్కల షేవ్ చేసుకొనే వచ్చాడు.

గౌన్లోకి మారిన తరువాత స్ట్రెచ్చేర్ మీద పడుకో బెట్టి, మందులు, సెలైన్ ఎక్కించడానికి ముంజేతిలో ఓ సిరకి ఓ సూది ఎక్కించారు. చేతికి విశ్వం పేరు,పుట్టిన తేదీ లాంటి వివరాలతో బాటు ఓ చిప్ ఉన్న బ్యాండ్ తగిలించారు. ఎదురుగా ఉన్న ఓ పెద్ద టీవీ స్క్రీన్ పైన సర్జరీ కు ఆ రోజు షెడ్యూల్ చేసిన వారి పేర్లు ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు అని చూపిస్తున్నది. లక్ష్మి కి, సీత బయట ఉన్నా, విశ్వం ఆపరేషన్ కు రెడి అవ్వటం, ఆపరేషన్ రూంకు పోవడం, ఆపేరేషన్ థియేటర్ ఉండడం తరువాత రికవరీ రూమ్ కు తీసుకు పోవడం అన్నీ తెలుస్తాయి.

విశ్వం ను అటు తరువాత స్ట్రెచ్చేరు లో పడుకో బెట్టి ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్లడం, అక్కడ మళ్ళీ సర్జరీ టేబిల్ మీదకి మార్చడం, ఎదో పలకరింపుల మధ్య ఊపిరి పీల్చుకోమని చెప్తుండగానే స్పృహ కోల్పోవడం ఓ కల లాగా గడిచిపోయింది.

సీత ఎక్కడో పిల్చినట్లనిపిస్తే బలవంతంగా బరువుగా ఉన్న రెప్పలు విప్పి చూస్తే సీత లీలగా కనిపించింది విశ్వంకు. ఎక్కడో హాల్ లో పడుకో బెట్టారు. తలా తిప్ప గలుతున్నాడు కానీ శరీరం సహకరించడం లేదు.

"కంగ్రాట్స్ విశ్వం. ఆపరేషన్ సక్సెస్ ఫుల్ అన్నారు, సర్జన్. గుడ్ జాబ్. నువ్వు తట్టుకొని గెలిచావు విశ్వం", అంటూ, అప్రయత్నంగా విశ్వం బుగ్గ మీద ఓ ముద్దు పెట్టింది, సీత కంట్లో నీళ్లాడుతుండగా.

–28–

**మయామి, ఫ్లోరిడా**

**నవంబర్, 2014**

బిస్కేన్ బొలెవార్డు లో  ఉన్న హై రైస్ బిల్డింగ్ 30 వ అంతస్తులో పని చేస్తూ ఉంది ఆయష. కొన్ని రోజుల క్రితమే బాస్టన్ లో ఓ టాప్ కన్సల్టింగ్ కంపెనీ లో చేరింది. ముందు ట్రైనింగ్ ఇచ్చి తరువాత ఓ కన్సల్టెంట్ ను షాడో చేయ మన్నారు. ఆ కన్సల్టెంట్ అప్పటికే ఓ పది ఏళ్ళు పనిచేసి, పార్టనర్ స్థాయి కి ఎదగాలని చూస్తూ ఉంది. ప్రతీ వారం సోమవారం పొద్దున్నే మయామిలో దిగడం, గురువారం వరకు పనిచేయడం తిరిగి వీకెండ్ కు బాస్టన్ కు వెళ్లిపోవడం. పనిలో చేరి కొన్ని రోజులే అయ్యినా అప్పుడే బోర్ కొట్టేస్తున్నది ఆయష కు. 30 వ అంతస్తు నుంచి మయామి పోర్ట్ కనిపిస్తున్నది. పెద్ద పెద్ద క్రూయిజ్ ఓడలు పోర్ట్ లో కనిపిస్తున్నాయి. ప్రయాణికులు చెక్ ఇన్ అవ్వుతూ ఉండాలి. సాయంత్రం కల్లా ఆ ఓడలు పోర్ట్ వదిలి, కేరింతలు కొడుతున్న వేల కొద్ది ప్రయాణికులతో బాటు, కెరేబియన్ ద్వీపాలు వెదుక్కుంటూ పోతాయి. ఆయష కు అరసుతో కొద్దిరోజుల క్రితం టాంప పోర్ట్ నుండి వెళ్లిన క్రూయిజ్ జ్ఞాపకం వచ్చింది. అక్కడ లక్ష్మి ని కలవడం కూడా గుర్తొచ్చింది. ఆ టైము ఎంత బాగా ఉన్నదో అన్న బాధా మిళితమైన ఫీలింగ్ కలిగింది.

ఆయష ఫాలో అవ్వుతున్న సీనియర్ అనిత ఒక్క సారి విసుగ్గా ఫోన్ పెట్టేసింది. ఆయష ఆ చప్పుడుకు ఇహ లోకంలో పడి, ఏంటి? అన్నట్టుగా కను బొమ్మలు ఎగరేసింది.

"టెర్రిబుల్ ఫ్రస్ట్రేషన్ ఆయష. పనామలో ఓ లాయర్ల కంపెనీకి కన్సల్టెంట్ గా ఓ ఆరు నెలల ముందు పని చేసాను. అప్పటికింకా నువ్వు ఈ పనిలో చేరలేదు. నేనప్పుడు ఆ కంపెనీని చూసి, అనలైజ్ చేసి కొన్ని సవరణలు రెకమెండ్ చేస్తే, ఒక్కటీ అమలు పరుచ లేదు. బిజీ అంటారు, బడ్జెట్ లేదంటారు మొత్తం మీద ఎదో సాకు చెప్పి ఏమి చేయలేదు. మన సూచనలు పాటించక పోతే, మనకు వేలు పోసి ఆ రిపోర్ట్ రాయమనడం దేనికి?", అన్నది అనిత, ఆయష తో.

బోరు కొడుతున్న ఆయాష కు ఈ సంభాషణ కొంచెం ఉత్సాహం తెచ్చింది.

"ఏ కంపెనీ. నీ విచ్చిన రెకమెండేషన్లు ఏమిటీ?", ఆయష, అదో కేస్ స్టడీ లా తీసుకుంటూ.

"చెప్పాను కదా లాయర్ల కంపెనీ అనీ. వాళ్ళు అంతర్జాతీయంగా ఏవో కంపెనీలు అవి సృష్టించి కార్పొరేట్ రంగానికి టాక్స్ డబ్బులు ఆదా చేస్తారట. నాకు వాళ్ళ బిజినెస్ మోడల్ గజిబిజి గానే ఉంది. కాని నాకిచ్చిన పని, వారి కంప్యూటర్ సిస్టం లను పరిశీలించి తరువాత తీసుకోవాల్సిన స్ట్రాటజిక్ నిర్ణయాలను వారికి చెప్పడమే. ఓ రెండు వారాలు సరిపోయింది. పనామా సిటీ కు పోయి వాళ్ళ బిజినెస్, కంప్యూటర్ సిస్టమ్స్ పరిశీలించాను. అలా చూస్తుంటే ఆ కంప్యూటర్ లు బాగా వెనుక బడ్డాయి అని తెలిసింది. ముఖ్యం గా వాళ్ళు ఉపయోగిస్తున్న సాఫ్ట్వేర్ పాతది. కొత్త వర్షన్స్ రిలీజ్ అయ్యాయి. వాళ్లు ఉపయోగిస్తున్న ద్రుపల్ డేటా బేస్ లో చాలా సెక్యూరిటీ లొసుగులున్నాయి. ఇంటర్నెట్ ఉన్నవాడెవారైన ఆ డేటాబేస్ ను హెక్ చేయ వచ్చు",అన్నది అనిత.

"అలాంటి సాఫ్ట్వేర్ కు ప్యాచ్ వేయవచ్చును కదా. లేకపోతే, కొంత డబ్బు పెట్టి కొత్త హార్డ్వేర్, లేటెస్ట్ సాఫ్ట్వేర్ కొని డేటా మైగ్రేట్ చేయ వచ్చు కదా", అంది ఆయష.

"కదా ఆయష. కానీ చేయటం లేదు. ఆ లాయర్లను పట్టడమే కష్టం. ఇదిగో ఓ నెల రోజుల తరువాత ఇవ్వాళ మీటింగ్ పెట్టారు. నేనిప్పుడు చేస్తున్న పని వదిలి పెట్టి ఆ మీటింగ్ కు హాజరు అయ్యాను. ఏమి లాభం. అంతా విని, డబ్బులు మరో స్ట్రాటజిక్ ప్లాన్ మీద ఖర్చు పెట్టాల్సి వచ్చిందని, నేను వెంటనే అప్ గ్రేడ్ చేయమన్న నా సూచనలను పక్కకు పెట్టారు. నేను చెప్పిన పనికి పెద్ద ఖర్చు కాదు, సమయము పట్టదు. ఈ లాయర్ల బుర్రలో దూరి వారి ప్రవర్తనకు కారణాలు వెదకడం అసంభవం. వారు మనకు కొరుకుడు పట్టరని తెలిసిపోయింది", అనిత.

"నా కర్థం అయ్యింది. నాకు అప్పుడే బోర్ కొట్టేస్తున్నది. మీరు ఇన్ని రోజులెలా ఈ కంపెనీ లో ఎలా గడిపారు తెలియటం లేదు", అంది ఆయాష.

"ఇక్కడి పని ఓ సారి తెలిస్తే సులువే. కంపనీ లో నీలా ఓ పది ఏళ్ల క్రితం చేరాను. ఇక ఈ సంవత్సరం పార్టనర్ గా ప్రమోషన్ ఎదురు చూస్తున్నాను. ఓ సారి పార్టనర్ అయ్యిన తరువాత పని సులువే అని చాలా మంది చెప్పగా విన్నాను", అంది అనిత.

ఆయష కు అన్ని ఏళ్ళు అనిత లాగా పని చేయడం అసాధ్యం అనిపించింది. వెంటనే క్రూయిజ్ లో కలిసిన లక్ష్మి, తన స్టార్ట్ అప్ లో చేర మని చెప్పడం గుర్తుకు వచ్చింది. లక్ష్మి వాళ్ళ తల్లి తండ్రులు టాంప లో ఉన్నట్లు, తను మయామి లో ఉన్నట్లు చెప్పింది. ఫోన్ చేస్తే పొలా అని తన ఫోన్ కాంటాక్ట్స్ వెదికింది.

పని మీద మయామి లో ఉన్నట్లు, కలవడానికి వీలవుతుందా అని టెక్స్ట్ చేసింది.

టెక్స్ట్ చేసిన కొద్ది నిమిషాలలోనే లక్ష్మి నుండి కాల్.

"హలో ఆయష మయామి ఎప్పుడొచ్చావు. ఎన్ని రోజులుంటున్నావు?", అంది లక్ష్మి.

"లక్ష్మి నైస్ టు హియర్ యువర్ వాయిస్. కంపెనీ పని మీద వచ్చాను. ప్రతీ వీకెండ్ బాస్టన్ కు తిరిగి వెళ్లి పోవడమే", అంది ఆయష.

"ఓహ్ అప్పుడే కన్సల్టింగ్ కంపెనీలో చేరిపోయావా? నీకు మయామి వాతావరణం నచ్చిందా, నువ్వు చేస్తున్న పని నచ్చిందా?", అడిగింది లక్ష్మి.

"మయామి వాతావరణం బాగా నచ్చింది. మన ఇండియాలో ఉన్నట్లే ఉంది...",అంటూ ఆయష ఆగింది. ఆయష కు తను ఈ కంపెనీ చేరిన రోజులు గుర్తుకు వచ్చాయి. తాను చేరిన తరువాత గడిపిన రోజులు గుర్తుకు వచ్చాయి. పక్కన అనిత కూడా ఉంది. ఎలా జవాబు చెప్పడం అని మదన పడుతుండగానే,

లక్ష్మి "ఆయష ఈ వీకెండ్ నాతో మయామి లో గడుపు. నా ఆఫీసు చూపిస్తాను. ఈ ఊళ్ళో ఉన్న మంచి ప్రదేశాలకు కూడా నిన్ను తీసుకెళ్తా. అవి టూరిస్ట్ ప్రదేశాలు కావు. నీకు తప్పక నచ్చుతుంది అని నా నమ్మకం", అంది లక్ష్మి.

ఆయష ఆ వారాంతం ప్లేన్ టికెట్లు క్యాన్సల్ చేసి, కారు, హోటల్ బాడుగలు పొడిగించింది. శని వారం పొద్దున్నే లక్ష్మి టెక్స్ట్ చేసిన అడ్రస్ జి పి ఎస్ లో పెట్టుకొని ఓ పది నిమిషాల కంతా చేరిపోయింది. ఆయష బిస్కెన్ బౌలెవార్డు లో ఆఫీసు దగ్గరున్న హోటల్ లోనే ఉంటున్నది. అక్కడినుంచి లక్ష్మి ఉంటున్న సౌత్ బీచ్ కి పెద్ద దూరం లేదు. రెండిటి మధ్య సముద్రం, వాటిని కలుపుతున్న అందమైన రోడ్డు. లక్ష్మి యూక్లిడ్ అవెన్యూ లో ఉంది. ఓ రెండు రోడ్లు దాటితే సౌత్ బీచ్, సముద్రం కనిపిస్తాయి. ప్రొద్దున కాబట్టి, స్ట్రీట్ పక్కనే పార్కింగ్ దొరికింది. లేకపోతే పార్కింగ్ పెద్ద తల నొప్పే సౌత్ బీచ్ లో.

లక్ష్మి ఓ 2 బెడ్రూం కాండో లో ఉంటున్నది. ఆయషను చూస్తూనే హగ్ చేసుకొని ఇంటి లోపలికి తీసుకెళ్లింది. లక్ష్మీ తో బాటు ఓ చిన్న టెర్రియర్ కుక్క, చాలా బొచ్చుతో ఉన్న ఓ పిల్లి ఎదురొచ్చాయి. ఆ కాండో టౌన్ హౌస్ లాగా ఉంది. కింద డ్రాయింగ్ రూమ్, డైనింగ్ రూమ్, కిచెన్ అన్ని ఓపెన్ ప్లాన్ లో కట్టారు. పైన బెడ్ రూములు ఉండాలి. డైనింగ్ రూమ్ నే లక్ష్మి తన ఆఫీసు అని చెప్పింది. డైనింగ్ టేబిల్ మీద ఓ లాప్ టాప్ ఉంది. అప్పుడప్పుడు లాప్ టాప్ తీసుకెళ్లి, పక్కనున్న

డ్రాయింగ్ రూమ్ సోఫాలో వాలి, లేక కిచెన్ కౌంటర్ మీద పెట్టి కూడా పని చేసుకోవచ్చు అని చెప్పింది. డ్రాయింగ్ రూమ్ ఓ మూల స్టేషనరీ బైక్ కూడా ఉంది. దాని పైన కూడా లాప్ టాప్ పెట్టుకొనే సౌకర్యముంది. ఆ రూమ్ లో ఓ వైపు గోడ మీద టీవీ ఫ్లాట్ స్క్రీన్, మరో వైపు ఓ పెద్ద పెయింటింగ్ ఉంది. అక్కడక్కడ బోన్సాయ్ చెట్లు అందంగా అమర్చి అదో మినిమలిస్ట్ ఇంటికి మోడల్ లాగా ఉంది.

ఆయష పెయింటింగ్ వైపు చూస్తుండడం చూసి, " నీకూ ఆర్ట్ అంటే ఇంటరెస్ట్ ఉన్నట్టుంది. అలా అయితే సౌత్ బీచ్ నీకు తెగ నచ్చుతుంది. ఇక్కడే 'ఆర్ట్ బాసెల్' ప్రతీ ఏటా జరుగుతుంది", అంది లక్ష్మి.

"ఈ పెయింటింగ్ అక్కడే కొన్నారా?", అని అడిగింది ఆయష.

"కాదు. అది పని చేస్తూ, మధ్యలో బ్రేక్ తీస్కునప్పుడెల్లా, పెయింట్ చేసింది. ఓ విషయం చెప్పనా, ఇంటికి చాలా మంది, ఇది వరకే వచ్చారు. కానీ టైము తీసుకుని, పెయింటింగ్ చూసి, ప్రశ్నలు వేసిన మొదటి వ్యక్తి నువ్వే", అంది లక్ష్మి నవ్వుతూ.

"ఇల్లు ఇలా సింపుల్ గా, అందంగా పెట్టడం నాకు బాగా నచ్చింది. ఈ పెయింటింగ్ చాలా బాగా వేసారు. రూముకు బాగా నప్పింది. సౌత్ బీచ్ లో ఇళ్ళు బాగా ఖరీదేమో కదా. మీరు పని కూడా ఇంట్లోనే చేస్తుంటే బోర్ కొట్టటం లేదా?", అడిగింది ఆయష.

"పని అంటావా, బోర్ కొట్టే సమస్యే లేదు",అంది లక్ష్మి తన కాలి దగ్గరే తచ్చాడుతున్న, పిల్లిని చేతిలో తీసుకుంటూ "బ్రేక్ కావలసినప్పుడు నాకిష్టమైన పనులు చేయడమో లేక అలా స్టేషనరీ బైక్ రైడ్ చేయడమో మరి కొన్ని సార్లు బీచ్ మీద నడవడమో చేస్తుంటాను. ఆ ఫ్లెక్సీబిల్టీ నాతో బాటు ఈ కొత్త కంపెనీలో పని చేసే వారందరికి ఉండాలని, నా ఆశ. ఇక ఇల్లు అంటావా, ఈ మధ్య రియల్ ఎస్టేట్ బాగా పడిపోయింది. రెంట్ చేసే బదులు ఇల్లు కనుక్కోవడం ఇప్పుడు మంచిది. నువ్వు కూడా కావాలంటే కొనుక్కోవచ్చు. అపార్టుమెంట్లు చాలా అమ్మకానికి దొరుకుతున్నాయి", అంది.

"డౌన్ పేమెంట్ వెంటనే కట్టలేనేమో. ఓ సంవత్సరం తరువాత కొంటాను", అంది ఆయష.

"డౌన్ పేమెంట్ గురించి వర్రీ అవ్వద్దు. నీకు మంచి క్రెడిట్ రేటింగ్ ఉంటే, మిగాతావన్నీ, సులువే. నా బ్యాంకర్ కు నిన్ను పరిచయం చేస్తాను. మీట్ యాంగ్", అని పిల్లిని ఆయష చేతికిచ్చి, లక్ష్మి కుక్కను ఎత్తుకుని, "వీడు యింగ్" అంది. కిచెన్ కౌంటర్ మీదున్న కాఫీ మెషిన్ దగ్గరికెళ్లి ఫ్రెష్ గా బ్రు చేసి, కాఫీ తనకో కప్పు ఆయష కో కప్పు తెచ్చింది. సోఫా సెట్ లో కూర్చున్న తరువాత తను చేస్తున్న పని గురించి వివరించింది. మైక్రోసాఫ్ట్ ఆఫీసు సృష్టించి నట్లు, తానూ సెక్యూరిటీ రంగంలో ప్రతీ ఒక్కరికీ ఉపయోగ పడేలా సాఫ్ట్వేర్ ప్రొడక్ట్ లు సృష్టించాలని తన ఆలోచన అని చెప్పింది. తనింత వరకు

చేసిన పని నచ్చి ఈ మధ్యనే వెంచర్ కాపిటలిస్టు లు ఫస్ట్ రౌండ్ ఫైనాన్సు విడుదల చేసారని, అందుకే తన కంపెనీ లో చేరే మొదటి ఉద్యోగి కోసం వెదుకు తున్నాను అని చెప్పింది.

అటు తరువాత లక్ష్మి తో కలిసి సౌత్ బీచ్ లో కొంత సేపు తిరిగారు. అక్కడి కాఫీ షాప్ వాళ్ళకి, రెస్టారెంట్లలో పని చేస్తున్న వాళ్లకి లక్ష్మి సుపరిచతమై ఉండాలి. అందరూ లక్ష్మి ని నవ్వుతూనే పలుకరిస్తున్నారు.  తరువాత ఫ్రూట్ అండ్ స్పైస్ గార్డెన్ కి తన కారులోనే తీసుకెళ్లింది. అక్కడ ప్రపంచం నలు మూలల నుండి తెచ్చి నాటిన పండ్ల చెట్లు ఉన్నాయి. భూమి మీద రాలిన పండ్లు అన్నీ ఏరుకొని తినొచ్చు. ఆ గార్డెన్ పోయే దారంత నర్సరీ లు ఉన్నాయి. ఆర్కిడ్స్ , బోన్సాయ్ చెట్లు పది డాలర్ల కే దొరుకుతున్నాయి. ఆ నర్సరీలలో కూడా తిరిగారు. ఆయష తను పనిచేసే వర్క్ డెస్క్ మీద పెట్టుకోవడం కోసం ఓ బోన్సాయ్ చెట్టు కొన్నది.

లక్ష్మి తో కలిసి గడిపిన ఆ సమయం ఇట్టే గడిచిపోయింది. ఆయష కు వారి సంభాషణలు, పని మీద నుంచి ఆర్ట్, పాలిటిక్స్ లాంటి విషయాల వైపు మళ్లడం, మళ్ళి పని మీదకి సునాయాసంగా ప్రయాణం చేయడం ముచ్చటగా అనిపించింది. ప్రస్తుతం లక్ష్మి, తను ఎక్కువ జీతం ఇవ్వలేనని, స్టాక్ ఆప్షన్ ఇవ్వగలనని, పని కూడా తన లాగే డైనింగ్ టేబిల్ మీద చేయాలి, కావాలంటే సోఫాలో పడుకొని చేసిన అభ్యంతరం లేదని నవ్వుతూ లక్ష్మి చెప్పడం, తెగ నచ్చేసింది.

సోమ వారం ఆఫీసుకు వెళ్లిన వెంటనే, లక్ష్మి తో తన స్టార్ట్ అప్ కంపెనీలో చేరుతానని చెప్పింది ఆయష.

అనిత ను చూడగానే "గుడ్ మార్నింగ్ అనిత. నేను రిజైన్ చేస్తున్నాను", అన్నది ఆయష.

"గుడ్ మార్నింగ్. అప్పుడే? చేరి కొన్ని వారాలు కూడా కాలేదు కదా", అన్నది అనిత.

"ఇప్పుడు వదిలేయక పోతే, వదిలేయడం కష్టమే", అన్నది ఆయష.

ఆయష ముఖంలో ఇది వరకు చూడని సంతోషం, చిలిపిదనం అనితకు కొత్తగా కనిపించింది.

–29 –

2014

భారత ప్రభుత్వ, అమెరికా ప్రభుత్వ ఇంటెలిజెంట్ సర్వీసుల మధ్య మూడు రోజుల భేటి

"సలీం, అరసు మాట్లాడుతున్నాను. బాగున్నావా?", అన్నాడు అరసు ఫోన్లో.

"అరసు, నీవేలా ఉన్నావు? ఆయష నువ్వు వస్తున్నట్లు చెప్పింది.  పి.ఎల్. గ్రూప్ లో చేరుతున్నట్లు విన్నాను. కంగ్రాట్స్", అన్నాడు సలీం.

"బాగానే ఉన్నాను అరసు. బోర్డ్ లో  డైరెక్టర్ గా జాయిన్ అయ్యాను.   ప్లేన్ దిగిన వెంటనే నా పని మొదలైపోయింది. మాగ్రూప్ లో ఉన్న కంపెనీ నేతల తో మీటింగులు పెట్టారు. నీ తో మాట్లాడాలని అనుకుంటూనే ఉన్నాను, ఇదిగో, ఇప్పుడే వీలైంది", అన్నాడు అరసు.

"నీకు తెలుసు కదా, నేనూ మీ పి.ఎల్. గ్రూప్ ట్రస్ట్ నడుపుతున్న హాస్పిటల్ లోనే ఆంకోలజిస్ట్ గా పనిచేస్తున్న. మా హాస్పిటల్ హెడ్ కూడా నిన్ను కలిసి ఉంటాడేమో", అన్నాడు సలీం.

"అవును ఆయష చెప్పింది, నీవు మా గ్రూప్ హాస్పిటల్ లో చేరి నట్లు. ఓ రోజు నిన్ను చూడడానికి హాస్పిటల్ వస్తాను. మీ హాస్పిటల్స్ గ్రూప్ హెడ్ తో మీటింగ్ ఇంకా కాలేదు. ట్రస్ట్ కంపనీ అధినేతలతో మీటింగ్లు ఇంకో రెండు రోజుల తరువాత కానీ మొదలవ్వవు. ఇంతకీ నీ పనేలా ఉంది. ఆయాష నీకని ఓ ప్యాకెట్ పంపించింది. కలవడానికి వీలవ్వుతుందా. సాయంత్రం నీతో డిన్నర్ కి కలుద్దామనుకున్నాను, కానీ వీలవ్వదేమో. మరో కంపెనీ మీటింగ్ ఉందన్నారు", అన్నాడు అరసు.

"డిన్నర్ దేమి ఉందిలే.  నీవు కొంచెం సెటిల్ అయ్యాక కలుద్దాం. ప్యాకెట్ ఎవరితోనైనా పంపించు.  ఇక నా పని అంటావా, బిజీ నే. ఎంత చెట్టు కంత గాలి అన్నట్లు నాకు టీచింగ్, పేషంట్ కన్సల్టింగ్ల తో పని సరిపోతుంది. అన్నట్టు ఈ మధ్యనే ఓ కొత్త రిసెర్చ్ మొదలు పెట్టాను. మా హాస్పిటల్ కు వచ్చే జనాలలో ఒక రకం క్యాన్సర్ మరీ ఎక్కువగా ఉంది. దానికి కారణం వెదుకుతున్నాను",అని ఉత్సాహంగా చెప్పాడు సలీం.

"సరే మా సెక్రటరీ కి చెప్పి పంపిస్తాను. నీ రీసెర్చ్ ఇంటరెస్టింగ్ గా ఉంది. నువ్వు కనుకున్న తరువాత నాకు ఆ కారణం చెప్పు. ఆయష అంటూనే ఉంటుంది. నీవు ఓ నోబెల్ ప్రైజ్ కి తగ్గ పని చేస్తావని.  ఆల్ ది బెస్ట్. నీకు నోబెల్ ప్రైజ్ వస్తే పి.ఎల్.గ్రూప్ ట్రస్ట్ కి వచ్చినట్లే. మళ్లీ కలుద్దాం", అని అరసు ఫోన్ పెట్టేసాడు.

సాయంత్రం చాలా ముఖ్యమైన మీటింగ్ అంటూ మహేష్, అరసుతో బాటు బయలుదేరాడు. నాన్న పి.ఎల్. హోస్ట్ చేస్తున్న మీటింగ్ అని తెలిసిన తరువాత అరసుకు అది ముఖ్యమైనదే అని తెలిసి పోయింది. కానీ అర్ధం కాని విషయం ఆ మీటింగ్ వూరి బయట ఉన్న ఫార్మ్ హౌస్ లో జరగటం.

ఓ పాతిక కంటే తక్కువే ఉంటారు వచ్చిన అతిధులు. పి.ఎల్. కు అక్కడ వచ్చిన వారు చిరపరిచితులు అని ఆయన పలకరింపులలోనే తెలిసిపోతున్నది.  విశాలమైన ఆవరణలో పూల్ పక్కనే డ్రింక్స్, అపెటైజర్లు సర్వ్ చేస్తున్నారు. పి.ఎల్.

వచ్చిన వారిని అరసుకి పరిచయం చేస్తున్నాడు. కొందరు పి.ఎల్. లాగానే తమ వారసులతో వచ్చారు. విచిత్రం అందరూ బిజినెస్ నడపటం లేదు. కొందరు సినిమా, రాజకీయ రంగాలలో నుంచి వచ్చారు. కొందరు ఏమి పని చేస్తున్నారో సరిగా అర్థం కాలేదు. అర్థం అయ్యిందల్లా అందరూ బాగా డబ్బు హోదా ఉన్నవారిని. వీళ్ళందరిని ఇక్కడ అరసు పరిచయం కోసం పి.ఎల్., బహుశ, మహేష్ చెప్పిందాని వల్ల ఏర్పాటు చేసినా, వీళ్ళందరికి ఒక గుంపుగా వర్తించే లక్షణమేమో అరసుకి అర్థం కాలేదు. పరిచయాల తరువాత తనంతటికి తానే తిరుగుతూ ఉంటే రీమ తటస్థ పడింది. రీమను అరసు చూడడానికి కారణం, తన లాగే రీమ కూడా వాళ్ళ తండ్రి సిద్దార్ద్ తో వచ్చింది. సిద్దార్ద్ పేరు వినని వారు అరుదే. మొన్నటి వరకు సినిమా పరిశ్రమలో ఎదురు లేని హీరో . ఇప్పటికి ఓ సూపర్ స్టార్. ఆయన వయస్సు కు తగ్గ పాత్రలు ఇస్తూ , ఆయన చుట్టు సినిమా కథ లల్లి డబ్బు చేసుకుంటున్నారు.

రీమా, అరసు ఒక పక్కకు పోయి కబుర్లలో పడ్డారు. రీమా కూడా అమెరికాలో వెస్ట్ కోస్ట్ లో స్టేన్ఫోర్డ్ లో చదివానని చెప్పింది. ఫైనాన్స్ లో ఎం బి ఏ చేసిన తరువాత ఇండియా వచ్చి సినిమాలలో నటించడమే కాక, తండ్రి సృష్టించిన షో బిజినెస్ లను, ఇతర రియల్ ఎస్టేట్ వ్యాపారాలను చూస్తున్నాను అని చెప్పింది. సిద్దార్ద్ సినిమాలలో ఇంకా నటిస్తున్నాడు, ఆయనకు దూబై, లండన్, న్యూ యార్క్ నగరాలలో ఆస్తులు ఉన్నాయని తెలుసు కానీ తనకు ఇంత పెద్ద బిజినెస్, దానిని మేనేజ్ చేయడానికి ఒక కంపెనీ, రీమా ఉన్నారని ఇప్పుడే తెలిసింది.

"రీమ ఆమ్ ఇంప్రెస్సెడ్. ఇన్ని బిజినెస్ లు మేనేజ్ చేయ గలుగుతున్నావంటే, అదీ నటిస్తూ , నాకు ఆశ్చర్యంగా ఉంది. నీకు ఏది కష్టమైన ఛాలెంజ్ అనిపిస్తుంది ", అని అడిగాడు అరసు. ఆ ప్రశ్న వెనుక కారణం, రీమ పట్ల ఓ ఆకర్షణ, తను కూడ ఇప్పుడు పి.ఎల్ గ్రూప్ కంపెనీ లు చూడడం మొదలెట్టాడు కాబట్టి.

రీమ కొంచెం ఆలోచించింది. రీమ అలా ఓ వైపు తల వాల్చి, తన పెద్ద కళ్ళు అరమోడ్పుతో ఆలోచిస్తుంటే, ఎంత అందంగా ఉంది, ఎంతైనా హీరో సిద్దార్ద్ కూతురు కదా అనుకున్నాడు అరసు. అలా అనుకున్న వాళ్లలో అరసు మొదటి వాడు కాదు.

"ఇంటరెస్టింగ్ క్వశ్చన్. అసలు ఈ బిజినెస్ లు నడపటంలో నాకు సమస్యలు లేవు, ఛాలెంజ్ లు లేవు. ఇలాంటివి మేనేజ్ చేయడానికే స్టేన్ఫోర్డ్ లో చదివాను కదా. ఛాలెంజ్ మా నాన్న సిద్దార్థ్ కున్న పేరే. అయన కూతురు అన్న నీడ నుండి తప్పించుకోలేక పోతున్నాను. సిద్దార్ద్ నీడ పడకుండా స్పాట్ బాయ్స్ లైట్స్ చుట్టూ వేసి మేనేజ్ చేయ వచ్చు నేమో, కానీ నేను పక్కనుంటే ఆయాన నీడ నుండి నన్ను తప్పించటం దాదాపు అసాధ్యం. అదే నాకు పెద్ద ఛాలెంజ్", అంది రీమ.

అరసు రీమ జవాబు విని అవాక్కు అయ్యాడు. తేరుకుని, గట్టిగా నవ్వేస్తు "యు హిట్ ఇట్ ఆన్ నెయిల్", అంటూ హై ఫై ఇవ్వడానికి చేయి పైకి చాచాడు. రీమ కూడా నవ్వుతూ  తన చేయి చాచి అరసు చేయితో కలిపింది. ఇద్దరి ఒక క్షణం కనెక్ట్ అయ్యి నట్లనిపించింది. వారి మాటలు కూడా అవధులు లేకుండా ప్రవహించడం మొదలైయ్యాయి.

వీరు ఇలా మాట్లాడుతుండగానే, మరో కొందరు ముప్పై ఏళ్ల వయస్సు లో ఉన్న వారు తారస పడ్డారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకున్న తరువాత తెలినదేమిటంటే, అందరూ విదేశాలలో చదువుకున్నవారే, తల్లి, తండ్రుల నుంచి బిజెనెస్, లేక రాజా కీయ పదవులు, వారసత్వంగా తీసుకొనే ప్రయత్నంలో, మెలుకువ లు తర్ఫీదు పొందుతున్నవారే.

డిన్నర్ కని ఏర్పాటు చేసిన లోపలి హాల్ కు పోక ముందు, అరసు మహేష్ ను వెదికి,

"మహేష్ మీటింగ్ అన్నారు. ఇదేదో సోషల్ గ్యాథెరింగ్ లాగా ఉంది. అందరూ సంబంధం లేని రంగాలలో నుంచి వచ్చారు", అన్నాడు అరసు.

"బాబు, అరసు, మనం జినీవా లో లాయర్ల ను కలిసాం గుర్తుందా?", అని అడిగాడు మహేష్.

"పనామా లాయర్లేనా ? వాళ్ళకి ఈ గుంపుకి సంబంధం ఏమి ఉంది?", అన్నాడు అరసు.

"సంబంధం ఉంది. అందరికి విదేశాలలో ఆస్తులు ఉన్నాయి. ఆ ఆస్తులన్ని గుప్తంగా ఉండడానికి, పనామా లాయర్లే సహాయ పడుతున్నారు. అంతే కాదు, వీరిలో ఎవరికి సమస్య వచ్చినా ఇక్కడి వారు ఆ సమస్య వారికే వచ్చినట్లు ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు. వీరికి పరువు ముఖ్యం. దానిని కాపాడు కోవడానికి ఎంతైనా తెగిస్తారు. ఉదాహరణకు, సిద్దార్ధ్ మీద ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కన్ను పడింది అని సిద్దార్ధ్ కు ఈ గుంపులో ఉన్న ఓ పెద్ద ప్రభుత్యోగి,  ముందే ఫోన్ చేసి చెప్పాడు..

ఈ గుంపు, స్టీలు దిగుమతుల మీద రాయితీలు తగ్గాలంటే, అవి ప్రభుత్వం వచ్చే బడ్జెట్ లో తగ్గిచ్చేస్తుంది. లోన్ లు కావాలంటే, ఇట్టే దొరికిపోతాయి. ఎవరైనా ఇబ్బంది పెట్టుతున్నారు అని తెలుస్తే, పోలీసులు వారికి తగిన గుణపాఠం చెప్తారు", అన్నాడు మహేష్

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments